

**ఎస్. వెంకటేశ్వరరెడ్డి**

“రేపు ఆఫీస్‌లో కలుస్తా గురూ” అని వినయ్‌కి వీడ్కోలు చెప్పి టైమ్ చూసుకున్నాను.

రాత్రి ఒంటిగంట కావొస్తోంది.

అమీర్‌పేట్ సత్యం సినిమా హాలునుంచి సెకండ్ షో సినిమా చూసి ఇంటివైపుకు నడుస్తున్న నాకు ఎవరో వెంబడిస్తున్నట్టు అనిపించి వెనక్కి చూశాను. రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. అక్కడక్కడా కుక్కలు మొరుగుతున్న శబ్దాలు తప్పితే అంతా నిశ్శబ్దంగా వుంది. దూరంగా వెలుగుతున్న వీధిదీపాల వెలుగులో ఎవరో ఒక వ్యక్తి నిల్చుని దిక్కులు చూస్తున్నాడు.

ఎందుకో వళ్ళంతా చెమటలు పట్టసాగాయి. పరుగులాంటి నడకతో ఇంటివైపుగా అడుగులేశాను. మరికొంచెం దూరం నడిచి మళ్ళీ వెనక్కి తిరిగి చూశాను...

పిచ్చోడు!

ఇందాక వీధి దీపం వెలుగులో కనిపించిన వ్యక్తి పిచ్చోడిలా వున్నాడు. నేను వెనక్కి తిరిగి చూడడం గమనించి దిక్కులు చూస్తూ నిల్చుండిపోయాడు. మరో పదినిమిషాలు నడిస్తేగానీ ఇల్లు చేరుకోలేను. ఆ పిచ్చోడు నన్నే ఎందుకు వెంబడిస్తున్నాడో అర్థం కాక వేగంగా అడుగులేస్తూ పరుగులాంటి నడకతో ఇంటివైపు దారితీశాను.

స్కూటర్ మీద వచ్చుంటే అసలీ గొడవుండేది కాదు. పిసినారితనంగా దగ్గరే కదా అని నడుచుకొచ్చినందుకు నన్ను నేను మనసులో తిట్టుకున్నాను. మధ్య మధ్యలో వెనక్కి తిరిగి చూసినప్పుడల్లా ఆ పిచ్చోడు నా అంత వేగంగానే నా వెనుక వస్తుంటే నా వెన్నులో వణుకు మొదలయ్యింది.




నాకంటే కొంచెం పొట్టిగానే వున్నా ఖచ్చితంగా నాకంటే బలంగానే వున్నాడు. జడలు జడలుగా పెరిగిన జుట్టు, మట్టికొట్టుకుపోయిన ముఖం, చినిగిన బట్టలతో అప్పుడే ఏ చెత్తకుండీలోనుంచో లేచి వచ్చినట్టున్నాడు. పైగా తూలుతూ కూడా వున్నాడు. తాగి వున్నాడనుకుంటా. ఇంకో అర కిలోమీటరు నడిస్తే ఇల్లొచ్చేస్తుంది. ఇంతలో ఏదైనా చేసేస్తాడేమోననే భయంతో నా వళ్ళు జలదరించింది.

ఈ పిచ్చోడ్ని చూడటం ఇదే మొదటిసారి కాదు. అమీర్‌పేట ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర అడుక్కోవడం చాలా సార్లు చూశాను. అడిగినప్పుడు చిల్లర లేదన్నవాళ్ళని తిట్టడం, శాపాలు పెట్టడం చాలా సార్లు చూశాను. మొన్నొకరోజు ఎవరి మొహానో ఉమ్మేశాడు కూడా. అందుకే నాకింత భయంగా వుంది.

మధ్యలో వీధి దీపాలు కూడా వెలగడం లేదు. చుట్టూ చీకటి. మరో వందమీటర్ల దాకా ఏమీ కనిపించడం లేదు. ఈ చీకట్లో పిచ్చోడు నన్ను తప్పకుండా ఏదో ఒకటి చేస్తాడనిపించింది. ఎలాగోలా వీడి పీడ వదిలించుకోవాలని నిశ్చయించుకుని పక్కనే వున్న టెలిఫోన్ బూత్ వెనుక దాక్కున్నాను. పిచ్చోడు నాకోసమే వెతుకుతున్నట్టుగా అనిపించి అదను చూసి వెనుక నుంచి అతని మీద దూకి గొంతుపట్టుకున్నాను.

ఐదు నిమిషాలు ఇద్దరమూ పెనుగులాడుకున్నాక బలంగా కడుపులో రెండు గుద్దులు గుద్దాను. చేతికందిన రాయినొకటి తీసుకుని అతని తలపై గట్టిగా కొట్టాను. దెబ్బలు బాగా గట్టిగా తగిలినట్టున్నాయి. రెండు చేతుల్తో తల పట్టుకుని నన్నొదిలేశాడు. అతని నుంచి వేరుపడి వేగంగా ఇంటివైపు పరిగెడ్తుంటే అతను తిడ్తున్న తిట్లు వినలేక చెవులు మూసుకున్నాను.

ఆ గొడవ తర్వాత ఇంటికెప్పుడు ఎలా చేరుకున్నానో అస్సలు గుర్తులేదు. ట్రింగ్ ట్రింగ్‌మని అలారం మోగడంతో మెలుకువ వచ్చింది. రాత్రి జరిగిందంతా ఒక కలలా అనిపించింది. రోడ్డుమీద పడుకుని, రోడ్డుమీదే గడిపే ఒక పిచ్చివాడితో నేను గొడవపడతానని నేను కలలోనైనా ఊహించలేదు.

స్నానం చేస్తుంటే తెలిసింది రాత్రి గొడవలో నాకు తగిలిన దెబ్బల గురించి. పెద్ద దెబ్బలేమీ కాకపోయినా మొహం మీద గోళ్ళతో రక్కడం వల్లనేమో గాట్లు బాగానే పడ్డాయి. ఆఫీస్‌లో ఏం సమాధానం చెప్పాలో, ఏ కథ అల్లాలో ఆలోచిస్తూ ఎనిమిదిన్నరకల్లా ఆఫీస్‌కు బయల్దేరాను.

ఇదండీ జరిగిన కథ. నేను పోలీసులకి చెప్పిన కథ. వాళ్ళు నిజమని నమ్మిన కథ. క్షణాల్లో కథలు అల్లగలిగే నా ప్రతిభకు అద్దంగా నిలిచిన కథ.

అసలు నేనీ కథ పోలీసులకెందుకు చెప్పానో వాళ్ళిది నిజమని ఎందుకు నమ్మారో తెలుసుకోవాలంటే ముందు నాగురించి చెప్పాలి.

నాది మార్కెటింగ్ ఉద్యోగం. ఇన్స్యూరెన్స్ దగ్గర్నించి పర్సులు, బెల్టులు, సాక్సుల వరకూ ఏదైనా ప్రజలకు అమ్మడమే నా ఉద్యోగం. ఈమధ్యనే కంప్యూటర్ విడిభాగాలు అమ్ముతున్న ఓ కంపెనీలో చేరాను. నాకు పెళ్ళికూడా అయింది. ఆ పెళ్ళికి విడాకులు కూడా అయ్యాయి. నా తప్పేమీ లేదు. నాకు పిచ్చని చెప్పి నా పెళ్ళాం నన్నొదిలి వెళ్ళిపోయింది. చాలారోజులు బాధపడ్డాను. ఒంటరి జీవితం గడిపాను. కొన్ని రోజులకా జీవితమే అలవాటయిపోయింది.

నేను పైకి ఆనందంగానే కనిపిస్తూ వుండేవాడిని కానీ నా మాజీభార్య నన్ను పిచ్చోడంటూ వదిలి వెళ్ళిపోయి మరొకరితో సంబంధం కూడా పెట్టుకోవడమే కాక నాకు పిచ్చని అందరికీ ప్రచారం చేస్తుండటంతో నా మనసు కోపంతో రగిలిపోయేది. అందుకే ఒకరోజంతా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాను. ఆరోజు రాత్రే నా పథకాన్ని అమలుపెట్టాను.

ఆ రాత్రి నా భార్యను నేను హత్య చేశాను.

ఆరోజు సాయంత్రం నా కొలీగ్ వినయ్ సత్యం సినిమా హాలులో సెకండ్ షో సినిమా చూడ్డానికి వెళ్తున్నాడని ముందే తెలుసుకున్న నేను, సెకండ్ షో సినిమా టికెట్‌ని కొని సినిమా చూడ్డానికి వెళ్ళకుండా సరాసరి నా మాజీ భార్య ఇంటికెళ్ళాను. గంటలో పనయిపోయింది. సరిగ్గా ఇంటర్వెల్ సమయానికి గోడదూకి సినిమా హాల్లోకి దూరాను. అక్కడ క్యాంటిన్ దగ్గర టీ తాగుతున్న వినయ్‌ని కలిసి "అరే నువ్వుకూడా వచ్చావా గురూ" అంటూ ఆశ్చర్యం నటించాను. నేను తెలివిగా ఆ సినిమా ముందు చూసెయ్యడంతో సినిమా గురించి కాసేపు చర్చించి మళ్ళీ హాల్లోకి బయల్దేరాం.

సినిమా అయిపోయాక చేసే ప్రయత్నంలో ఆమె నా మొహంపైన గోళ్ళతో రక్కిన గాయాల నుంచి పోలీసులకనుమానం రాకుండా చేసే మార్గం నా కళ్ళముందు మెదిలింది. వెంటనే అక్కడున్న ఒక రాయి తీసుకుని ఆ పిచ్చోడి తలపై మోదాను. కడుపులో రెండు గుద్దులు గుద్దీ పారిపోయాను. పాపం మంచి నిద్రలో వున్నట్టున్నాడు. ఊహించని దెబ్బలు బాగా బాధించినట్టున్నాయి. గట్టిగా అతను చేసిన ఆర్తనాదాలు నాకు చాలా దూరం వరకూ వినిపించాయి.

అలా వినయ్‌ని, ఆ పిచ్చోడిని నా సాక్ష్యాలుగా ఉపయోగించుకోవడానికి పథకం పన్నాను.

ఆ తర్వాత రోజు ఉదయం ఆఫీస్‌లో అడుగు పెట్టగానే మా బాస్ అడిగేశాడు. మొహం మీద గాయం గురించి. ఏదో ఒకటి చెప్పి తప్పించుకుని వినయ్ వద్దకెళ్ళాను. నన్ను చూడగానే–

"నిన్నరాత్రికి ఫైటింగ్ సినిమా చూసి నువ్వు కూడా ఫైటింగ్ మొదలు పెట్టావా ఏంటి?" అని అడిగాడు వినయ్.

నిజానికి ఆ గాయాన్ని నిన్న రాత్రి చీకట్లో గమనించాడో లేదో అనే విషయం నిర్ధారించుకోడానికే నేను వినయ్‌వద్దకెళ్లింది. వున్న ఆ ఒక్క అనుమానం కూడా తీరిపోవడంతో ఆరోజంతా హడావుడిగా పనిచేసి సాయంత్రానికల్లా రెండు లక్షలకు పైగా విలువైన ఆర్డరు సంపాదించి ఇంటివైపు బయల్దేరాను.

ఆ సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుంటే దారిలో కొత్తగా ప్రారంభించిన బిర్యానీ సెంటర్ కనిపించింది. ఆ మధ్య కాలంలో సరైన తిండి తిని చాలా రోజులవడంతో బిర్యానీ పేరు వినగానే నోరూరింది. ఇంటికెళ్ళి స్నానం చేసి కాసేపు రిలాక్సయ్యి వచ్చి బిర్యానీ తినాలని నిర్ణయించుకుని నా పాత డొక్కు స్కూటర్‌ని ఇంటివైపు పరుగులు తీయించాను.

మా ఇంటిముందు గుమికూడిన జనాన్ని, పోలీసు జీపుని చూడగానే నా గుండె జల్లు మంది. నేనంతా పథకం ప్రకారమే చేసినా నా మాజీ భార్య చనిపోతే పోలీసులు మొదటగా అనుమానించేది నన్నే అని తెలుసు. కానీ హత్యగురించి పోలీసులకు అంత తొందరగా తెలిసిపోతుందని నేనూహించలేదు. పోలీసుల్ని చూడగానే భయమేసిన మాట నిజమే కానీ నేను సృష్టించిన సాక్ష్యాలు నన్ను నిందితునిగా నిరూపించలేవనే నమ్మకం నాకు ధైర్యాన్నిచ్చింది. ఆ ధైర్యంతోనే స్కూటర్ ఆపి ఆ గుంపువైపు అడుగులేశాను.

అందరికంటే ముందుగా మా పక్కింటి రావుగారు నన్ను చూశారు. రావుగారు నావైపు చూపించి పోలీసులకేదో చెప్పాడు. చాలాసార్లు ఆయన పాల ప్యాకెట్లు దినపత్రికలు దొంగిలించాననే కోపాన్ని

ఇలా తీర్చుకున్నాడు రావుగారు. కానీ రావుగారికేం తెలుసు నా టాలెంట్.

''వెంకట్ అంటే మీరేనా?'' అడిగాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్.

''అవును, ఏం జరిగింది?'' అని అడిగాను ఏమీ తెలియనట్టు.

''మీరు మాతోపాటు పోలీస్ స్టేషన్‌కి రావాలి''

''నేనేం చేశానని మీతోపాటు రావాలి'' ధైర్యంగా అడిగాను.

''నిన్నరాత్రి మీ మాజీ భార్యని ఎవరో హత్య చేశారు. దానికి సంబంధించి మిమ్మల్ని ప్రశ్నించాలి'' అన్నాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్.

పోలీస్ స్టేషన్‌కు వెళ్ళేదారిలో ఇన్‌స్పెక్టరుతో చెప్పాను నేనూ నా భార్య విడాకులు పొంది రెండేళ్ళయిందని. జీవితంలో మొదటిసారి పోలీస్‌స్టేషన్‌కి రావడంతో కాస్త ఇబ్బందిగానే అనిపించింది. సినిమాల్లో చూపించినట్టు మొహం మీద లైటేసి నీళ్ళు కొట్టి చితక్కొడతారేమో నని భయమేసింది. తీసుకెళ్ళి నన్నొక గదిలో కూర్చోబెట్టారు. తుప్పు పట్టిపోయిన ఇనుపటేబుల్, కుర్చీలు తప్ప మరేమీ లేవు ఆ గదిలో. టెన్షన్‌తో గొంతెండిపోయింది. దాహం వేస్తుంది నీళ్ళు కావాలని కానిస్టేబుల్ ఒకాయన్ని అడిగాను. పాపం మంచోడిలా వున్నాడు, బాటిల్ నిండా నీళ్ళు తెచ్చిచ్చాడు.

చాలాసేపటి తర్వాత పోలీస్ ఇన్‌స్పెక్టర్ వచ్చి నాకెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

''చూడండి వెంకట్‌గారూ! ఈ మర్డర్ మీరే చేశానని నేనటం లేదు. అలాగని చెయ్యలేదని కూడా అనటం లేదు. అనుమానం వున్న వారిని ప్రశ్నించే హక్కు మాకుంది. అందువలన మీరూ మా ప్రశ్నలకు సమాధానమిచ్చి సహకరిస్తే బావుంటుంది''

అందుకు సమాధానంగానే ముందు మీకు చెప్పిన కథే పోలీసులకు కూడా చెప్పాను.

నేననుకున్నంతా సులభంగా పోలీసులు నా కథ నమ్మలేదు. వినయ్‌ని పిలిపించి అడిగారు. వినయ్ చెప్పిన సాక్ష్యంతో నా మీదున్న అనుమానం కాస్త తగ్గి నన్ను కాస్త గౌరవంగా చూడసాగారు. కానీ నేను చెప్పిన పిచ్చోడి విషయమే నాకు పెద్ద తలనొప్పయి కూర్చుంది. ఒక ఇల్లూ, వాకిలీ లేని ఆ పిచ్చోడు ఎక్కడున్నాడో వెతికి పట్టుకోడానికి పోలీసుల ప్రాణం తోకకొచ్చింది.

చాలాసేపు నన్ను పోలీస్ జీపులో ఎక్కించుకుని హైదరాబాదులో సగం తిప్పారు పోలీసోళ్ళు. చివరకు ఎర్రగడ్డ హాస్పిటల్ దగ్గర తలకు కట్టు కట్టుకుని ఫుట్‌పాత్‌పై పడుకుని కనిపించాడు.

ఆ పిచ్చోడ్ని కూడా జీప్‌లో ఎక్కించుకుని పోలీస్ స్టేషన్‌కి తీసుకొచ్చారు. అతనేం చెప్తాడో అని నాక్కొంచెం భయం వేసినా పిచ్చోడి మాటలకంటే నా మాటలకే పోలీసులు విలువిస్తారని నాకు నమ్మకం కలిగింది. అంతకుముందు వినయ్ చెప్పిన సాక్ష్యంతో పోలీసులకు నా మీద చాలావరకూ అనుమానం తీరిపోయింది.

ఆ పిచ్చోడు నిజంగానే పిచ్చోడు. పోలీసుల్ని మూడు చెరువుల నీళ్ళు తాగించాడు. వాడ్ని కొట్టింది నేనేనని ఒప్పుకొన్నాడు. కానీ నన్ను గోళ్ళతో రక్కలేదన్నాడు. ఆ విషయం విన్న పోలీసులకు నామీద మళ్ళీ అనుమానం మొదలయింది. ఆ పిచ్చోడ్ని మరోసారి ప్రశ్నించారు. ఈసారి ఆ పిచ్చోడు విచిత్రంగా నేను అతన్ని కొట్టలేదన్నాడు. కానీ నన్ను గోళ్ళతో రక్కింది మాత్రం నిజమని ఒప్పుకున్నాడు. అసలే పిచ్చోడయిన వాడికి నేను కొట్టిన దెబ్బతో పిచ్చి మరింత ఎక్కువయినట్టుంది.

నాలుగైదు సార్లు అడిగిన ప్రశ్నలే అడిగినా ఒక్కోసారి ఒక్కోరకంగా జవాబిస్తున్న ఆ పిచ్చోడి మాటలకు పోలీసులక్కూడా పిచ్చెక్కిపోయి నన్ను విడుదల చేసేసారు.

నేను హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. పోలీస్ స్టేషన్‌లో నేను ప్రదర్శించిన ధైర్యం, వినయ్ నాకనుకూలంగా చెప్పిన సాక్ష్యం, పిచ్చోడి పిచ్చి సమాధానాలు, పిచ్చోడ్ని నేను తలపై గాయపర్చిన విషయం, అతని కడుపులో నేను గుద్దిన గుద్దుల సంగతి, ఇవన్నీ కలిసి పోలీసులు నన్ను అనుమానించకుండా చేశాయి. పథకం ప్రకారమే అంతా జరిగిందన్న ఆనందంతో హాయిగా ఇంటివైపు బయల్దేరాను.

పోలీస్ స్టేషన్లో లోపల్లోపల నేను పడ్డ టెన్షన్‌కి నాకు పిచ్చెక్కినంత పనయింది. అప్పటికే అలసిపోయి వున్న నేను ఎప్పుడు నిద్రపోయానో కూడా తెలియదు. చాలా రోజుల తర్వాత సుఖంగా నిద్రపోయాను ఆరోజు.

అదండీ కథ. ఇప్పుడు చెప్పండి. నా మాజీ భార్య అందరికీ చెప్పినట్టు నాకు పిచ్చా? పిచ్చోళ్ళెక్కడయినా ఇలా తెలివిగా ఒక హత్య చేసి తప్పించుకోగలరా?

ధభ్...ధభ్...

ఒక్క నిమిషం. ఎవరో వచ్చినట్టున్నారు. కాలింగ్ బెల్ నొక్కాలనే జ్ఞానం కూడా లేని ఆ మూర్ఖులెవరో చూసి వస్తాను, మీరెక్కడికీ వెళ్ళకండి. ఇప్పుడే వచ్చేస్తాను.

పోలీస్... పోలీస్.

అయ్యో! ఇప్పుడెలా?

దయచేసి ఈ రహస్యం పోలీసులకు చెప్పకండి.. ప్లీజ్..

''యు ఆర్ అండర్ అరెస్ట్!''

''నన్ను నమ్మండి సార్. నాకేమీ తెలియదు. నా మాజీ భార్యను నేను చంపలేదు''

నేను చెప్పేది పచ్చి అబద్ధమని నాకూ తెలుసు, మీకూ తెలుసు. కానీ పోలీసులకి తెలియదు. ప్లీజ్ మీరు చెప్పకండి.

''మిమ్మల్ని అరెస్ట్ చేసేది మీ మాజీ భార్య హత్యకేసు గురించి కాదు. రోడ్డుపై తిరిగే ఒక పిచ్చోడ్ని రాయితో దారుణంగా గాయపరిచి అతని మరణానికి కారణమయినందుకు''

డామిట్! కథ అడ్డం తిరిగింది. మీరేంటి? ఆ చూపుకు అర్థం ఏంటి? నన్ను పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్తుంటే మీకు పాట పాడాలనిపిస్తుందా? నమ్మక ద్రోహి. ఇప్పటివరకూ హాయిగా నే చెప్పిన కథ విని 'అనుకున్న దొక్కటి, అయ్యిందొక్కటి' అంటూ పాడుకుంటూ నీ దారిన నువ్వెళ్ళిపోతావా? హెల్ప్.. ప్లీజ్ హెల్ప్...

★

## ప్రాక్టికల్ పేషంట్




**ఒ**కాయన పెద్దగా దగ్గుతూ
మూలుగుతూ డాక్టర్
దగ్గరికొచ్చాడు. ఆయన గుండెకు
స్టెతస్కోప్ పెట్టి గట్టిగా
నాలుగైదుసార్లు వూపిరి తీయించి
వీపుమీద నాలుగైదు గుద్దులు గుద్ది
డాక్టర్ టెస్ట్ చేసాడు.
అంతా అయింతర్వాత ''నీకు డ్రింక్
అలవాటుందా?'' అని అడిగాడు డాక్టర్.
పేషంట్ మారు మాట్లాడకుండా జేబులోంచి
క్వార్టర్ బాటిల్ తీసి నీళ్లు కూడా అడక్కుండా కళ్లు
మూసుకుని ఒక గుటకేసాడు.
''స్మోకింగ్ కూడానా....'' అడిగాడు డాక్టర్.
పేషంట్ ఒక ప్రాక్టికల్ నవ్వు నవ్వి జేబులోంచి కత్తెర మార్కు సిగరెట్ తీసి నోట్లో పెట్టుకుని అగ్గిపుల్లతో స్టయిల్‌గా వెలిగించాడు. గుండెలనిండా పొగపీల్చి డాక్టర్ మొహానికి వదిలి ఖణేల్ ఖణేల్‌మని దగ్గాడు.
''లాభం లేదు... ఇవన్నీ మానేయకపోతే అస్సలు లాభంలేదు'' అన్నాడు డాక్టర్ మొహం చిట్లిస్తూ.
డాక్టర్‌వైపు అదోలా చూసి పేషంట్ బయటికెళ్లబోయాడు.
'' ఇదేం ధర్మాసుపత్రికాదు.... డాక్టర్ సలహాకు డబ్బులియ్యాలి'' అన్నాడు డాక్టర్ కోపంగా.
''నీ బోడి సలహా ఎవరు పాటించబోతున్నారు'' అంటూ పేషంట్ కత్తెరను, క్వార్టర్‌ను ఓపెన్ చేసాడు.